బిజెపి మతోన్మాదంతో లౌకికవాదానికి పెనుముప్పు

- హిందుత్వవాదం, నిత్య ఘర్షణలతో ఓట్ల రాజకీయం
- అమలు కాని హామీలతో కాంగ్రెస్ హడావుడి : తమ్మినేని

సభలో మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న మతోన్మాద విధానాలతో లౌకికవాదానికి పెనుముప్పు సంభవించే ప్రమాదం ఉందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం అన్నారు. బిజెపి విధానాలను తిప్పి కొట్టేందుకు పార్టీ శ్రేణులు ప్రజలను చైతన్యవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం మోటాపురం గ్రామంలోని బికెఆర్ ఫంక్షన్ హాల్‌లో పాలేరు డివిజన్ నాయకులు మల్లెల సన్మాతరావు అధ్యక్షతన జరిగిన సభలో తమ్మినేని మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజా సమస్యలను విస్మరించి హిందుత్వ, మతోన్మాద విధానాలతో ప్రజల మధ్య ఘర్షణలు సృష్టిస్తూ ఓట్ల రాజకీయం చేస్తోందని అన్నారు. ఇటీవల ప్రపంచ యుద్ధాలపై జరుగుతున్న పరిణామాలతో ప్రజల నుంచి వచ్చిన పిటిషన్‌పై స్పందించిన మహారాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పు బిజెపి అసమర్థ విధానాలకు అద్దం పడుతుందన్నారు. దేశంలోని న్యాయవ్యవస్థలను సైతం తప్పుదారి పట్టిస్తూ రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు. భారతదేశాన్ని హిందూ దేశంగా మార్చే కుట్రలో భాగంగా ఇటీవల బీహార్‌లో ఓట్ల సవరణ పేరుతో అక్కడి ముస్లింలను దేశం నుంచి వెళ్లగొట్టేందుకు ప్రయత్నిస్తుందన్నారు. ఇటీవల భారత్, బ్రిటన్ మధ్య ప్రధాని మోడీ చేసుకున్న స్వేచ్ఛ వాణిజ్యం వల్ల దేశ ప్రజలకు తీవ్ర నష్టం కలిగే ప్రమాదం ఉందని తెలిపారు. బిసిల సంక్షేమాన్ని ఏనాడూ పట్టించుకోని కాంగ్రెస్ పార్టీ.. బిసి రిజర్వేషన్ల పేరుతో ఓట్లు దండుకునేందుకు ప్రయత్నిస్తుందన్నారు. బిసి రిజర్వేషన్ విషయాన్ని బిజెపి నిశితంగా పరిశీలిస్తూ ఆచితూచి అడిగేసేందుకు ప్రయత్నిస్తుందని అన్నారు. కులాల లెక్కలతో హిందువులను ఐక్యం చేయడం సాధ్యం కాదనే భయంతో కులాన్ని మరిపించి మతాన్నిపైకి లేపేందుకే బిజెపి మొగ్గు చూపుతుందన్నారు.

'స్థానిక' ఎన్నికలతో రాష్ట్ర ప్రభుత్వం హడావుడి

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను విస్మరించి అమలు కానీ హామీలతో స్థానిక ఎన్నికల పేరుతో హడావుడి చేస్తుందని తమ్మినేని అన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి రూ.8 వేల కోట్లు మాత్రమే కేటాయించిన ప్రభుత్వం.. నాలుగున్నర లక్షల ఇండ్ల నిర్మాణానికి సుమారు రూ.22,500 కోట్లు ఖర్చు చేస్తామని ఎలా చెబుతుందని ప్రశ్నించారు. ఇది ముమ్మాటికీ పేదలను ఇందిరమ్మ ఇండ్ల ఆశల పేరుతో భ్రమల్లో ముంచడమేనన్నారు. ప్రజలను సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే రాష్ట్రంలో కాళేశ్వరం, బనకచర్ల సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలు, నీటి వాటాల పంపకాలు, ఫోన్ ట్యాపింగులు వంటి చర్చల పేరుతో కాలయాపన చేస్తుందని విమర్శించారు. ఈ విషయంలో ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ కూడా ఆంధ్ర, తెలంగాణ నీటి వాటాల పేరుతో సెంటిమెంట్‌ను రెచ్చగొట్టి మరోసారి ఓట్లు దండుకునేందుకు ప్రయత్నిస్తుందన్నారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, పాలేరు డివిజన్ కమిటీ ఇన్‌చార్జి బండి రమేష్, జిల్లా నాయకులు ఎర్ర శ్రీనివాసరావు, షేక్ బషీరుద్దీన్, బండి పద్మ, నేలకొండపల్లి, కూసుమంచి, ఖమ్మం రూరల్, తిరుమలాయపాలెం మండలాల కార్యదర్శులు కేవీ రామిరెడ్డి, తోటకూరి రాజశేఖర్, ఊరడి సుదర్శన్‌రెడ్డి, కొమ్ము శ్రీను, డివిజన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యూరియా సరఫరాపై బిజెపి రాష్ట్ర అధ్యక్షుడికి మంత్రి తుమ్మల లేఖ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర బిజెపి అధ్యక్షులు రామచంద్రరావుకు వ్యవసాయరంగంపై కనీస అవగాహన కూడా లేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విమర్శించారు. కేంద్రం రాష్ట్రానికి 9.80 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయిస్తే...12 లక్షల మెట్రిక్ టన్నుల సరఫరా చేసిందంటూ ఆయన అర్థంలేని మాటలు మాట్లాడుతున్నారని తెలిపారు. ఆదివారం ఈ మేరకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు యూరియా సరఫరాపై ఆయనకు లేఖ రాశారు. రాష్ట్ర ప్రజలు యూరియా కోసం తిప్పలు పడుతుంటే, రాష్ట్రానికి బిజెపి గొప్పలు చేసినట్టుగా చెప్పుకోవడం సిగ్గుచేటని తెలిపారు. తమ రాజకీయ లబ్ధి కోసం రైతులను తప్పుదోవ పట్టించడం మానుకోవాలని మంత్రి హెచ్చరించారు.

జైపాల్‌రెడ్డి ఉత్తమ పార్లమెంటేరియన్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మాజీ కేంద్రమంత్రి, సూదిని జైపాల్ రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆదివారం సిఎం రేవంత్ రెడ్డి జైపాల్‌రెడ్డికి నివాళు లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జైపాల్‌రెడ్డి ఉత్తమ పార్లమెంటేరియన్‌గా పేరుతెచ్చుకున్నారని గుర్తు చేశారు. రాష్ట్ర, దేశ రాజకీయాల్లో ఆయన ఒక ఉన్నత శిఖరమని, ప్రజాస్వామ్యం, రాజకీయాల పట్ల లోతైన అవగాహన ఉన్న వ్యక్తి అని కొనియాడారు. ప్రతి అంశంపై అద్భుతమైన వాగ్ధాటి, చతురత ఆయన సొంతమన్నారు. విద్యార్థి నాయకుడిగా, ఎమ్మెల్యేగా, ఎంపిగా, కేంద్రమంత్రిగా అనునిత్యం ప్రజల కోసమే పని చేశారని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర సాకారంలో జైపాల్ రెడ్డి పోషించిన పాత్ర ప్రజలెప్పుడూ మరిచిపోలేరని గుర్తుచేసుకున్నారు. రాజకీయాల్లో ఎప్పుడూ విలువల విషయంలో రాజీ పడలేదని, నిష్కళంక నేతగా, విలువలకు ప్రతీకగా నిలిచారన్నారు. దక్షిణాది నుంచి తొలిసారి ఉత్తమ పార్లమెంటేరియన్ పురస్కారం అందుకున్న నేతగా జైపాల్ రెడ్డి ఘనత సాధించారన్నారు. ఆయన ఆశయాలను, ఆకాంక్షలను ముందుకు తీసుకుపోవడమే నిజమైన నివాళి అన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం

పదేళ్లలో ఒక్క రేషన్‌కార్డూ ఇవ్వలే..

- కాంగ్రెస్ ప్రభుత్వంలోనే నూతనకార్డులు
- ప్రజలందరికీ చేరుతున్న సంక్షేమ పథకాలు : పొన్నం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల హయాంలో ఒక్కరికీ రేషన్‌కార్డు ఇవ్వలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే సిద్దిపేట జిల్లాకు నూతనంగా 26వేల రేషన్‌కార్డులను మంజూరు చేసిందని తెలిపారు. సిద్దిపేట జిల్లాలోని హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట మండలాల్లో చేపట్టిన నూతన రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొని లబ్ధిదారులకు కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయా కార్యక్రమాల్లో మంత్రి మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందజేస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లతో పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్నామన్నారు. ఆర్థిక స్థోమత లేని వారికి మహిళా సంఘాల ద్వారా లక్ష రూపాయల రుణం అందిస్తున్నామన్నారు. అనంతరం పలు మండలాల్లో కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. అక్కన్నపేట కెజిబివి పాఠశాలలో వన మహోత్సవం కార్యక్రమంలో పాల్గొని చెట్లు నాటారు. కోహెడ మండలంలోని తంగళ్ళపల్లి గ్రామంలోని యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ స్థలాన్ని పరిశీలించి.. పనులు వేగంగా పూర్తి చేయాలని, విద్యుత్ పోల్స్ షిఫ్ట్ చేయాలని అధికారులకు ఆదేశించారు. స్థలం చుట్టూ కరివేపాకు, మునగ, జామ, తదితర మొక్కలు నాటాలని సూచించారు. చిన్నకోడూరు మండలంలోని పోతారం (ఎస్) వద్ద జాతీయ రహదారి పక్కన వనమహోత్సవంలో కలెక్టర్ కె.హైమావతితో కలిసి మొక్కలను నాటారు.

భారత రాజ్యాంగం జోలికొస్తే భూ స్థాపితమే..

- ఆర్ఎస్ఎస్, అదాని, అంబాని చేతుల్లోనే మోడీ పాలన
- బిసి రిజర్వేషన్లకు కేంద్రం మోకాలడ్డు : జూలకంటి
- ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మస్కు నర్సింహ 5వ వర్ధంతి సభ

సభలో మాట్లాడుతున్న జూలకంటి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

భారత రాజ్యాంగం జోలికొస్తే కేంద్రంలోని మోడీ ప్రభుత్వం భూస్థాపితం కాక తప్పదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి హెచ్చరించారు. ఆదివారం ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మస్కు నర్సింహ 5వ వర్ధంతిని పురస్కరించుకొని రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని పాషా, నరహరి స్మారక కేంద్రంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సామెల్ అధ్యక్షతన నిర్వహించిన సభలో జూలకంటి రంగారెడ్డి పాల్గొన్నారు. ముందుగా నర్సింహ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జూలకంటి మాట్లాడుతూ.. ఆర్ఎస్ఎస్, అదాని, అంబాని చేతుల్లోనే మోడీ ప్రభుత్వ పాలన నడుస్తోందని విమర్శించారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఈ 11ఏండ్లలో అనేకసార్లు రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసే కుట్ర జరిగిందని తెలిపారు. కేరళ, తమిళనాడు, వెస్ట్ బెంగాల్, పంజాబ్, తెలంగాణ రాష్ట్రాలకు పైసా కేటాయించకుండా బిజెపి వివక్ష చూపుతోందని అన్నారు. 42 శాతం బిసి బిల్లుకు ఆమోదం తెలపకుండా మోడీ ప్రభుత్వం మోకాలడ్డుతుందని తెలిపారు. పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను కాలరాస్తోందని, రైతు చట్టాలపై వెనక్కి తగ్గినట్టే తగ్గి మరో మార్గంలో వాటిని అమలు చేసేందుకు పూనుకుంటున్నదన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. బిజెపి విద్య, వైద్య రంగాలను పట్టించుకోవడంలేదని విమర్శించారు. ఓట్లు, సీట్లను సంతలో సరుకులాగా మార్చేసిందని మండిపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సామాన్యులు పోటీ చేసే పరిస్థితి లేదన్నారు.

తెలంగాణలో ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ప్రజా సమస్యలను విస్మరించి, బూతులను వల్లే వేస్తున్న అధికార, ప్రతిపక్ష పార్టీలను ఎండగట్టాల్సిన అవసరం ఉందని తెలిపారు. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తున్న పాలక పక్షాలపై సమరశీల పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. అసమానతలు లేని సమాజ నిర్మాణం ఎర్రజెండాకు మాత్రమే సాధ్యమవుతుందన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారసత్వాన్ని స్ఫూర్తిగా తీసుకొని ఉద్యమించాలన్నారు. నాటి నుంచి నేటి వరకు హత్యలు, నిర్బంధాలు, కేసులకు ఎదురొడ్డి కమ్యూనిస్టులు మాత్రమే ప్రాణ త్యాగాలు చేశారన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి శ్రమించిన మస్కు నర్సింహ ఉద్యమ స్ఫూర్తితో భవిష్యత్తు ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి పి యాదయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె భాస్కర్, సామెల్, రాంచందర్, కె జగన్, ఏర్పుల నర్సింహ, కవిత, చంద్రమోహన్ పాల్గొన్నారు.

మహారాజశ్రీ 9వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, కొవ్వూరు
O.S. No. 22/2022
Between:
Kolluru Lakshmi Muthya Kanaka Hanuma Sesha Jagandhara Rao ...Plaintiff
AND
1. Kolluru Venkata Ratnam, S/o. late Jaganadharao, Hindu, aged 75 years, Flat No. G2, H.No. 6-94/28/A, Vaishnu Priya Enclave Land Mark, Near: HUDA Colony, Electrical Sub Station, Sri Nilayam, 2, Phase-2, Sivaji Nagar, Chanda Nagar, Hyderabad, Telangana.
2. Kolluru Naga Venkata Satya Sudheer, S/o. Venkata Ratnam, Hindu, aged 30 years, Flat No. G2, H.No. 6-94/28/A, Vaishnu Priya Enclave Land Mark, Near: HUDA Colony, Electrical Sub Station, Sri Nilayam, 2, Phase-2, Sivaji Nagar, Chanda Nagar, Hyderabad, Telangana.
3. Maddirala Venkata Lakshmi Narayana, S/o. Venkata Ratnam, Hindu, aged 40 years, Resident of Flat No. 304, D.No. 72-73, Sri Sai Residency, R.K.Society, Borabanda, Bala Nagar, K.V.Ranga Reddy District, Telangana State.
...1, 2, 3 Defendants
పై నెంబరు దావాలో 1, 2, 3 ప్రతివాదులు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 19-8-2025 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
యిన్నమూరి బాలసుబ్రహ్మణ్యం
రాజమండ్రి 27-7-2025
అడ్వకేట్, రాజమండ్రి సెల్:9700845909

వివక్ష నుంచి పుట్టిందే "ఊరి చివరి మనిషి"

- రాములు ఆత్మకథ ముందు తరాలకు స్ఫూర్తి
- సుద్దాల అశోక్‌తేజ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఏడు దశాబ్దాల మానసిక సంఘర్షణ, వివక్ష నుంచి పుట్టిందే 'ఊరి చివరి మనిషి' పుస్తకమని ప్రముఖ సినీ, గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ప్రజా సాంస్కృతిక వేదిక అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రిటైర్డ్ పోలీస్ అధికారి జె. రాములు స్వీయకథను అశోక్‌తేజ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అట్టడుగు వర్గాలకు చెందిన దళితులు, బడుగు బలహీన వర్గాలకు చెందిన వ్యక్తుల ఆత్మకథలను ఎవ్వరు రాయరని, మన కథల్ని మనమే రాసుకోవాలని అన్నారు. ఒక వేళ ఎవరైనా రాస్తే అది నరకబడిన జింక కథను వేటగాడు రాసినట్టు ఉంటుందని అభిప్రాయపడ్డారు. మారు గ్రామంలోని దళిత కుటుంబంలో పుట్టిన రాములు చదువు నుంచి మొదలుకుని ఉద్యోగ జీవితంలో ఎదుర్కొన్న సంఘర్షణలను ఈ పుస్తకంలో రచయిత దియా విఘ్నేష్ చెప్పిన తీరు బాగుందని అన్నారు. ఇలాంటి పుస్తకాలు భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని అభిప్రాయపడ్డారు. మనం జీవితంలో ఎదుర్కొన్న అవమానాలు, వివక్షల నుంచి పాఠం నేర్చుకుని వారికి అందనంత ఎత్తుకు ఎదగాలని అభిలషించారు. కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు మాట్లాడుతూ వేల సంవత్సరాల నుంచి భారత దేశంలో కుల వివక్ష వేళ్లూనుకుని పోయిందని అన్నారు. దానికి చిన్నా.. పెద్ద తేడా అనే బేధం లేదని చెప్పారు.

నేడు, రేపు హైదరాబాద్‌లో 'ప్రత్యేక బహిరంగ విచారణ'

- జాతీయ మానవ హక్కుల కమిషన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లో సోమ, మంగళవారాల్లో రెండు రోజుల పాటు 'ప్రత్యేక బహిరంగ విచారణ' చేపట్టనున్నట్టు జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సి) తెలిపింది. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. హైదరాబాద్‌లో రెండ్రోజులు 109 మానవ హక్కుల ఉల్లంఘన కేసులను విచారించనుంది. రాష్ట్రంలోని మానవ హక్కుల కార్యకర్తలు, ప్రతినిధులు, సీనియర్ అధికారులతో సమావేశం కమిషన్ ఈ సందర్భంగా సమావేశం కానున్నది. జులై 28, 29 తేదీల్లో తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఈ కేసులను కమిషన్ చైర్ పర్సన్ జస్టిస్ వి రామ సుబ్రమణియన్, సభ్యులు జస్టిస్ (డాక్టర్) విద్యుత్ రంజన్ సారంగి, విజయ భారతి సమక్షంలో సోమవారం ఉదయం పది గంటల నుంచి జూబ్లీహిల్స్‌లోని డాక్టర్ మర్రి చెన్నా రెడ్డి మానవ వనరుల కేంద్రంలో విచారించనున్నారు. ఫిర్యాదుదారులు, సంబంధిత రాష్ట్ర అధికారులు హాజరు కానున్నారు. ఎన్‌హెచ్‌ఆర్‌సి ప్రధాన కార్యదర్శి భరత్‌లాల్, డైరెక్టర్ జనరల్ (దర్యాప్తు) ఆర్‌పిమీనా, రిజిస్ట్రార్ (లా), జోగిందర్ సింగ్, ఇతర సీనియర్ అధికారులు కూడా పాల్గొననున్నారు.విచారణ సందర్భంగా చేపట్టనున్న కేసుల్లో పోలీసుల అధికార దుర్వినియోగం, ప్రభుత్వం ఇచ్చే వివిధ సామాజిక సంక్షేమ పథకాల కింద ప్రయోజనాలను తిరస్కరించడం, జైళ్లలో అక్రమాలు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు చెందిన మానవ హక్కులను పరిరక్షించడంలో నిర్లక్ష్యం, రాష్ట్రవ్యాప్తంగా వివిధ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల హక్కులు, ముఖ్యంగా గర్భిణులు, పాలిచ్చే తల్లులు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలు, అక్రమ రవాణా వంటివి ఉన్నాయి.

జులై 29న రాష్ట్ర ప్రభుత్వ సీనియర్ అధికారులతో ఎన్‌హెచ్‌ఆర్‌సి సమావేశం కానుంది. మానవ హక్కులకు సంబంధించిన వివిధ సమస్యలు, మానవ హక్కుల ఉల్లంఘన బాధితులకు వేగంగా న్యాయం అందించానికి ఉన్న ప్రాముఖ్యతపై వారికి అవగాహన కల్పించనుంది. సమాజంలోని వివిధ వర్గాల సంక్షేమం ఎన్‌హెచ్‌ఆర్‌సి ఇచ్చిన వివిధ సలహాలపై రాష్ట్ర ప్రభుత్వం, దాని అనుబంధ సంస్థలు తీసుకున్న క్రియాశీల చర్యలను కూడా కమిషన్ సమీక్షించనుంది. మధ్యాహ్నం రెండు గంటలకు రాష్ట్రంలోని మానవ హక్కుల సమస్యల గురించి తెలుసుకునేందుకు పౌర సమాజ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, మానవ హక్కుల పరిరక్షక (హెచ్ఆర్‌డి) ప్రతినిధులతో భేటీ కానుంది. ఈ ప్రత్యేక బహిరంగ విచారణ కార్యక్రమం ఫలితాలు, ఎన్‌హెచ్‌ఆర్‌సి తీసుకున్న చర్యలను విస్తృత స్థాయిలో తెలియజేసేందుకు మంగళవారం మధ్యాహ్నం 3.30 గంటలకు ఎన్‌హెచ్‌ఆర్‌సీ ప్రతినిధులు మీడియా సమావేశం నిర్వహించనున్నారు.

మానవ హక్కుల ఉల్లంఘనకు సంబంధించిన బాధితులకు అక్కడికక్కడే త్వరిత న్యాయం అందించేందుకు 2007 నుంచి ఎన్‌హెచ్‌ఆర్‌సీ వివిధ రాష్ట్రాల్లో ఎప్పటికప్పుడు ఇలాంటి ప్రత్యేక బహిరంగ విచారణ కార్యక్రమాలను నిర్వహిస్తోంది. గత వారం ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమం మంచి ఫలితాలను ఇచ్చింది. గతంలో ఉత్తరప్రదేశ్, బీహార్, కర్ణాటక, గుజరాత్, అస్సాం, మేఘాలయ, ఛత్తీస్‌గఢ్, మణిపూర్, మధ్యప్రదేశ్, పంజాబ్, కేరళ, పుదుచ్చేరి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఈ కార్యక్రమాలను నిర్వహించింది.

11న గిరిజన హక్కుల గర్జన

- కరపత్రాలను విడుదల చేసిన టిజిఎస్

కరపత్రాలను విడుదల చేస్తున్న టిజిఎస్ నాయకులు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ప్రపంచ ఆదివాసీ గిరిజన హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 9 నుండి 11వరకు తెలంగాణ గిరిజన సంఘం (టిజిఎస్) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా 'గిరిజన హక్కుల గర్జన' నిర్వహించనున్నట్టు టిజిఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం ధర్మానాయక్, ఆర్ శ్రీరాంనాయక్ తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తండాలు, మండల కేంద్రాల్లో హక్కుల గర్జన కార్యక్రమం జరగనుందని, 11న హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్రస్థాయి గిరిజన హక్కుల గర్జన నిర్వహించనున్నట్టు వెల్లడించారు. 'రాజ్యాంగంలోని గిరిజన హక్కులను కాపాడుకుందాం, అడవులు, భూముల నుండి గిరిజనులను గెంటేయడాన్ని ఆపాలి, గిరిజనులకిచ్చిన హామీల అమలుకై పోరాడుదాం' అనే నినాదాలతో ప్రపంచ ఆదివాసీ గిరిజన హక్కుల దినోత్సవాన్ని జరుపుతున్నట్టు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆదివాసీ గిరిజన తెగలు తమ హక్కుల సాధన కోసం ఆగస్టు తొమ్మిదిన ప్రపంచ ఆదివాసీ గిరిజన దినోత్సవాన్ని హక్కుల దినోత్సవంగా జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రతి ఏటా గిరిజన హక్కుల దినోత్సవాన్ని టిజిఎస్ నిర్వహిస్తున్నదని చెప్పారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకొచ్చిన నాటి నుండి రాజ్యాంగంలో ఆదివాసీ గిరిజనులకు కల్పించిన హక్కులు, చట్టాలను ఎన్నడూ లేని విధంగా కాలరాస్తున్నదని విమర్శించారు. అడవులు, అటవీ సంపదను కార్పొరేట్లకు కట్టపెట్టేందుకే నూతన అటవీ సవరణ చట్టాన్ని 2023లో ఆమోదించిందని గుర్తు చేశారు. దీంతో ఆదివాసీ గిరిజనులు అడవుల నుండి గెంటి వేయబడి నిరాశ్రయులుగా మారే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ గిరిజనులకిచ్చిన 16 రకాల వాగ్దానాలను తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన వాగ్దానాల్లో ఒక్కటి కూడా అమలు చేయకుండా కాలయాపన చేస్తూ గిరిజనులను మోసం చేస్తుందని విమర్శించారు. సామాజిక న్యాయాన్ని అమలు చేస్తున్నామని గొప్పలు చెపుతున్న ప్రభుత్వం ఇప్పటివరకు గిరిజన శాఖకు మంత్రిని ఎందుకు నియమించలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న గిరిజన వ్యతిరేక విధానాలపై రాబోయే కాలంలో పోరాడేందుకు ఉద్యమ కార్యాచరణను వచ్చేనెల 11న జరిగే గిరిజన హక్కుల గర్జన లో ప్రకటిస్తామని తెలిపారు. కార్యక్రమంలో హైదరాబాద్ సౌత్ జిల్లా అధ్యక్షులు రాంకుమార్ నాయక్, రంగారెడ్డి జిల్లా నాయకులు ఎం గోపి నాయక్, ఆర్ శేఖర్, కిషన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా ఆర్‌ఆర్ జ్యువెలర్స్ స్టోర్ ప్రారంభం

హైదరాబాద్ : ఆభరణాల రిటైల్ చెయిన్ సంస్థ ఆర్‌ఆర్ జ్యువెలర్స్ నగరంలో తమ నూతన లగ్జరీ జ్యువెలరీ గోల్డ్, డైమండ్, సిల్వర్ స్టోర్‌ను ఏర్పాటు చేసింది. దీనిని ప్రముఖ యాంకర్ సుమ కనకాల లాంచనంగా ప్రారంభించారు. ఈ స్టోర్ ప్రారంభం సందర్భంగా ఆగస్టు 10 వరకు అద్భుతమైన ఆఫర్లను అందిస్తున్నట్లు ఆ సంస్థ యాజమాన్యం తెలిపింది. తమ వద్ద అన్ని ఆభరణాలు హాల్మార్క్‌తో లభిస్తాయని.. పాత ఆభరణాలను కొత్తగా డిజైన్ చేసి ఇవ్వడం తమ ప్రత్యేకతన్నారు.

అన్నీ ఆలోచించే బిజెపికి రాజీనామా చేశా...

- రాజాసింగ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తాను అన్నీ ఆలోచించే బిజెపికి రాజీనామా చేశానని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. బిజెపిలో తిరిగి చేరేందుకు తాను ప్రయత్నిస్తున్నట్లు. కార్యకర్తల బృందాన్ని రాష్ట్ర కార్యాలయానికి పంపినట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని చెప్పారు."నా రాజీనామా వెనుక ఏ కుట్రా లేదు. ఎవరితో పార్టీకి నష్టం జరిగిందో అధిషా'నానికి చెప్పాలనుకున్నా. లక్షలాది మంది బిజెపి కార్యకర్తలు పార్టీ కోసం జీవితాలను త్యాగం చేశారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా నాకు ఫోన్ చేయలేదు. ఆయన ఫోన్ చేసేంత పెద్దవాడిని నేను కాదు. తెలంగాణలో బిజెపి అధికారంలోకి రావాలంటే ఒక ఫైటర్ కావాలి" అని రాజాసింగ్ అన్నారు.

IN THE COURT OF THE XXII JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT AT: HYDERABAD
O.S. No. 1004 of 2022
Between:-
Union Bank of India [A Govt. of India undertaking] [Formerly] Andhra Bank, Credit Card Division, Koti, Hyderabad, rep.by its Sr.Manager (Law) & Authorized Officer, ...Plaintiff
And
E.Kavya Pravala ...Defendant
To
E.Kavya Pravala, D/o.Johnson Prem Karan, Aged about 31 Years, Occ: Employee, R/o. SVS Group of Institutions, Bheemavaram, Hanumakonda-506015.
Take Notice that the above mentioned Suit is filed against you for recovery of a sum of Rs.1,26,638-19ps _to_wards utilization of Credit card. The above mentioned Suit is posted for your appearance on 20-08-2025.
In case of your failure to attend before the Court on 20-08-2025 at 10-30 A.M. either in person or through a Counsel the matter will be decided in your absence by setting you exparte.
(BY ORDER OF THE COURT)
T.Bhagya Raju
& Associate Advocates,
Counsel for the Plaintiff,
Flat No.402, Nirmal Ratna Aprts, Opp: R.S.Brothers, Chandanagar, Gangaram Village, **HYDERABAD**-50.

మాస్టర్ ప్లాన్ అంటే మ్యాప్ కాదు..

- హైదరాబాద్ మాస్టర్ ప్లాన్‌పై హెచ్‌సిఎఫ్ చర్చాగోష్టిలో వక్తలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ మాస్టర్ ప్లాన్ అంటే ఒక మ్యాప్ మాత్రమే కాదనీ, ప్రజల అవసరాలు తీర్చే ప్రణాళికగా ఉండాలని అర్బన్ పాలసీ నిపుణులు డాక్టర్ దొంతి నర్సింహారెడ్డి తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో హైదరాబాద్ సిటిజన్స్ ఫోరమ్ ఆధ్వర్యంలో "హైదరాబాద్ మాస్టర్ ప్లాన్ - తీరుతెన్నులు - నిశిత పరిశీలన" అనే అంశంపై చర్చా గోష్టి జరిగింది.ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ హైదరాబాదు నగర అభివద్ధి ప్రణాళిక - మాస్టర్ ప్లాన్ ప్రజల అవసరాలు తీర్చే విధంగా ఉండాలని చెప్పారు. ఏ మాస్టర్ ప్లాన్‌లోనయినా నిపుణుల భాగస్వామ్యం ఉంటుందన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు పెరిగే విధంగా, జీవనోపాధి అవకాశాలు కల్పించేలా, తాగునీరు, డ్రైయినేజీ, ప్రజారోగ్యం, విద్యా అవకాశాలు, ట్రాఫిక్, కాలుష్యం మొదలగు సమస్యలకు పరిష్కారం చూపేలా మాస్టర్ ప్లాన్ ఉండాలని అభిప్రాయపడ్డారు. కానీ అందుకు భిన్నంగా ప్రజల భాగస్వామ్యం లేకుండా ఎవో ప్రయివేట్ కన్సల్టెన్సీలకు అప్పజెప్పి, రియల్ ఎస్టేట్ వ్యాపారుల ప్రయోజనాలకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్ రూపకల్పన జరుగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. మాస్టర్ ప్లాన్ రూపొందకుండానే... రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాదు నగరంలో అనేక కొత్త ప్రాజెక్టులను ప్రకటిస్తున్నదనీ, ప్లాన్‌కు అనుగుణంగా ప్రాజెక్టులు ఉంటాయా ? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

2 నుంచి 18 వరకు సామాజిక చైతన్య యాత్ర

- కెజికెఎస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆగస్టు 2 నుంచి 18వ తేదీ వరకు అమరుల యాదిలో సామాజిక చైతన్య యాత్ర నిర్వహిస్తామని, ఈ యాత్రలో గీత కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కల్లుగీత కార్మిక సంఘం (కెజికెఎస్) రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు మేకపోతుల వెంకటరమణ (ఎంవి రమణ), బెల్లంకొండ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. దివారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో యాత్రకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ యాత్రల సందర్భంగా కల్లుగీసేటప్పుడు ప్రమాద నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, కాటమయ్య రక్షణ కవచం ప్రాధాన్యత, ఆరోగ్య సంరక్షణ, స్ఫూర్తిదాతల జీవిత విశేషాలపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. గీత వృత్తిపై లక్షలాదిమంది ఆధారపడి జీవిస్తుంటే.. కార్పొరేట్ సంస్థలు తమ లాభాల కోసం లిక్కర్, థమ్సప్, కోకోకోలా లాంటి శీతల పానీయాలు తెస్తున్నాయని అన్నారు. దాంతో గీత వృత్తి దెబ్బతింటుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారి ఖజానా నింపుకోవడానికి వారికే ప్రోత్సాహం కల్పిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ఒక కోటి తాటి, ఈత చెట్లు ఉన్నాయని, కల్లుతో పాటు నీరా, తాటి, ఈత ఉత్పత్తులు తయారుచేసి ఉపాధి కల్పించవచ్చొని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందించి గీతవృత్తిదారుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం బెల్లంకొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఎన్నికల సందర్భంగా గీత కార్మికులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. గీత కార్మికులందరికీ సేఫ్టీ కిట్టు ఇవ్వాలని, రూ.12.94 కోట్ల పెండింగ్ ఎక్స్‌గ్రేషియాలను విడుదల చేయాలన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా నందనంలోని నీరా, తాటి, ఈత ఉత్పత్తుల పరిశ్రమ ప్రారంభించాలని తెలిపారు. హైదరాబాద్‌లోని నీరా కేఫ్‌ను టెండర్ వేసి వచ్చిన ఆదాయాన్ని గీత కార్మికుల సంక్షేమానికి ఖర్చు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ, కేజీకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.వెంకట నరసయ్య, జనగాని రాజు గౌడ్, పొన్నం రాజయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గోడపత్రికను ఆవిష్కరిస్తున్న కెజికెఎస్ నాయకులు

క్యారెక్టర్ ఆర్టిస్టుల్లా వ్యవహరిస్తున్నారు

- జగదీష్‌రెడ్డి, కౌశిక్‌రెడ్డిపై ఎంపి చామల ఆగ్రహం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో
బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు జగదీష్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి రాజకీయాల్లో క్యారెక్టర్ ఆర్టిస్టుల్లా వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తనకు ఓట్లు వేయకపోతే చచ్చిపోతానంటూ బ్లాక్‌మెయిల్ చేసిన సూసైడ్ స్టార్ కౌశిక్‌రెడ్డి అని ఎద్దేవా చేశారు. జగదీష్‌రెడ్డిని టైగర్ కాదు.. ఆయనో ఎలుగుబంటిలాంటివారని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేటీఆర్, హరీశ్‌రావు మధ్య విభేదాలు తీవ్రస్థాయికి చేరుకోగానే ఈ పాత్రలు రంగంలోకి దిగుతాయని ఎద్దేవా చేశారు. కేసీఆర్ వద్ద మంచి పేరు సంపాదించుకోవడం కోసం సొల్లు మాటలు మాట్లాడుతుంటారని తెలిపారు.

అమ్జద్ హబీబ్ హెయిర్ అండ్ బ్యూటీ మరో శాఖ ఏర్పాటు

హైదరాబాద్ : నగరంలోని అల్కాపురిలో అమ్జద్ హబీబ్ హెయిర్ అండ్ బ్యూటీ బ్రాంచ్‌ను సలోన్ దక్ష నాగర్కర్ ప్రారంభించినట్లు నిర్వాహకులు తెలిపారు. సెలూన్ ఇండస్ట్రీలోనే అతి తక్కువ కాలంలో కస్టమర్స్‌కు దగ్గర అయిన ఏకైక సెలూన్ అమ్జద్ హబీబ్ హెయిర్ అండ్ బ్యూటీ అని పేర్కొన్నారు. 16 ఏళ్ల పాటు ఎపిజె అబ్దుల్ కలాం వ్యక్తిగత హెయిర్ స్టైలిస్ట్‌గా అమ్జద్ హబీబ్ పని చేశారని తెలిపారు.

ప్రాణం తీసిన ఈత సరదా

- బిటెక్ విద్యార్థి మృతి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో
సరదాగా ఈత కొట్టడానికి వెళ్లిన స్నేహితుల్లో ఒక యువకుడు నీటిలో మునిగి మృతిచెందిన ఘటన రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బోరుబండకు చెందిన అక్షితరెడ్డి (23), రోహిత్, పవన్, అనిల్ అనే నలుగురు స్నేహితులు గూగుల్ మ్యాప్ చూస్తూ సరదాగా రాజేంద్రనగర్‌లోని మూసీ వాగు వద్దకు వచ్చారు. అనంతరం నలుగురు స్నేహితులు మూసీలో ఈత కొట్టడానికి దిగారు. అందులో అక్షిత్ రెడ్డి ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. తోటి స్నేహితులు అతని చేయి పట్టుకుని పైకి లాగడానికి ప్రయత్నించినా చివరి నిమిషంలో చెయ్ జారిపోవడంతో అతను నీటిలో మునిగిపోయాడు. వెంటనే మిగతా స్నేహితులు.. స్థానికులు, పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, డిఆర్ఎఫ్ సిబ్బంది అక్షిత్‌రెడ్డి మృతదేహం కోసం గాలిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అమ్మకానికి అమ్మతనం..!

- అటు సరోగసీ.. ఇటు స్పెర్మ్ కలెక్షన్..
- స్పెర్మ్ ఇస్తే రూ.10 వేల వరకు చెల్లింపు
- గ్రేటర్‌లో రెచ్చిపోతున్న ఫెర్టిలిటీ సెంటర్లు
- పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ఐవిఎఫ్ సెంటర్లు



ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో
"తిలాపాపం.. తలా పిడికిడు" అన్నట్టుగా అటు ఫెర్టిలిటీ సెంటర్లు.. ఇటు స్మెర్మ్ కలెక్షన్ బ్యాంకులు అమ్మతనాన్ని అంగడి సరుకుగా మార్చేస్తున్నాయి. ఇక్కడ నో రూల్స్.. నో హ్యూమానిటీ, ఓన్లీ మనీ అన్నట్టుగా రెచ్చిపోతున్నాయి. పెరుగుతోన్న సంతానలేమీ సమస్యలతో ఐవీఎఫ్ సెంటర్లు పుట్టుకొస్తున్నాయి. ధనార్జనే ధ్యేయంగా పిల్లల్లేని దంపతులను మోసం చేస్తున్నాయి. సికింద్రాబాద్ స్పెర్మ్ టెక్ సంస్థపై జరిగిన దాడులతో విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి.

రాష్ట్ర రాజధాని నగరం గ్రేటర్‌లో ఫెర్టిలిటీ సెంటర్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. హైదరాబాద్‌లో దాదాపు 50, రంగారెడ్డిలో 40, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 30 వరకు ఫెర్టిలిటీ సెంటర్లు ఉన్నాయి. అనధికారికంగా మరికొన్ని సెంటర్లు కూడా కొనసాగుతున్నాయి. ఐయూఎఫ్, ఐవీఎఫ్ చికిత్సల పేరుతో రూ. మూడు నుంచి రూ. ఎనిమిది లక్షల వరకు వసూలు చేస్తున్నాయి. కాస్త పేరుగాంచిన సెంటర్లు ఏకంగా రూ.20 లక్షలు కూడా వసూలు చేయడానికి వెనుకాడటం లేదు. చికిత్సలు, మందులు వాడినా ఫలితం లేకపోవడంతో చివరకు అడ్డదారులు తొక్కుతున్నాయి. ఫెర్టిలిటీ సెంటర్లలోనే శుక్రకణాల బ్యాంకులను ఏర్పాటు చేసుకుంటున్నాయి. ఇక్కడ సరిపోను మిగిలిన వీర్యకణాలను ఇతర రాష్ట్రాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. దాంతో ఐవీఎఫ్ ట్రీట్‌మెంట్స్ తీసుకునేవారు.. ఇప్పుడు అనుమానాలు వ్యక్తం చేసే పరిస్థితి వస్తోంది. వారికి పుట్టిన బిడ్డలు నిజంగానే వారికి పుట్టిన వారేనా..? లేక వేరే డీఎన్ఏ ఉందా..? అనే సందేహాలు ఇప్పుడు వ్యక్తమవుతున్నాయి. ఇలా ఒక సంస్థ చేసిన పని, చాలా మంది తల్లిదండ్రుల్లో అనుమానాలను రేకెత్తిస్తోంది. ఇది పెను ప్రకంపనలు సృష్టించేలా ఉంది. ఇంకా ఎన్ని సంస్థలు ఇలాంటి దుర్మార్గాలకు పాల్పడుతున్నాయో.. అనే అనుమానాలు వస్తున్నాయి.

యువతే లక్ష్యంగా దందా

బాలీవుడ్‌లోని ఓ సినిమాలో హీరో.. స్పెర్మ్ అమ్ముకుని బతికేస్తూ ఉంటాడు. అలా గ్రేటర్ హైదరాబాద్ నగరంలో కొంత మంది యువకులు.. ఇదే పనిని పెట్టుకున్నారు. అందుకు కారణం సికింద్రాబాద్‌లోని సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ లాంటి ఇల్లీగల్ సంస్థలు ఉండటమే. నగరంలో యువతే లక్ష్యంగా శుక్రకణాల దందా పెరిగిపోతోంది. 30 ఏళ్లలోపు యువతీ యువకుల నుంచి సేకరించిన శుక్రకణాలు, అండాలను పిల్లల కోసం పరితపించే దంపతులకు అంటగడుతూ సొమ్ము చేసుకుంటున్నారు. సరోగసీ కోసం స్పెర్మ్ సేకరిస్తున్న టెక్ క్లినిక్ నిర్వాహకులు.. స్పెర్మ్‌ని ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. స్పెర్మ్ క్వాలిటీని బట్టి దాతలకు రూ. ఐదు నుంచి రూ. పది వేల వరకు ముట్టచెబుతున్నారు.

హైదరాబాద్‌లో ఇలాంటివి కొత్తేమీ కాదు..!

గ్రేటర్ హైదరాబాద్‌లోని ఫెర్టిలిటీ సెంటర్లలో అక్రమ కార్యకలాపాలు కొత్తేమీ కాదు. 2017లో బంజారాహిల్స్‌లోని సాయి కిరణ్ ఇన్‌ఫెర్టిలిటీ సెంటర్‌లో అక్రమ సరోగసీ కార్యకలాపాలు బయటపడ్డాయి, ఇక్కడ పేద మహిళలను లక్ష్యంగా చేసుకుని సరోగసీ కోసం ఒప్పందాలు చేసినట్టు అప్పట్లో ఆరోపణలు సైతం వచ్చాయి. ఈ కేసులో సరోగసీకి అనుమతి లేని విదేశీ జంటలకు సేవలు అందించినట్టు తేలింది. 2018లో ఢిల్లీలో స్పెర్మ్, గుడ్డు దొంగతనం కేసులో హైదరాబాద్‌కు కూడా సంబంధం ఉన్నట్టు తేలింది.

కమర్షియల్ సరోగసీ పూర్తిగా నిషేధం

కమర్షియల్ సరోగసీ మనదేశంలో పూర్తిగా నిషేధమైనప్పటికీ.. దందా మాత్రం ఆగడం లేదు. మనదేశంలో సరోగసీ, స్పెర్మ్ సేకరణలకు నిర్దిష్ట చట్టాలున్నాయి. కమర్షియల్ సరోగసీ మనదేశంలో పూర్తిగా నిషేధం. కేవలం ఆల్ట్రూయిస్టిక్ సరోగసీ.. అంటే మెడికల్ ఖర్చులు, ఇన్సూరెన్స్ మినహా.. ఆర్థిక ప్రతిఫలం లేని సరోగసీకి మాత్రమే అనుమతి ఉంటుంది. అలాగే సరోగేట్ మదర్ భారతీయ పౌరురాలై ఉండాలి. 25-35 ఏళ్ల వయస్సు కలిగి ఉండాలి. ఒక్కసారి మాత్రమే సరోగేట్‌గా ఉండగలదు. ఇంటెండెడ్ పేరెంట్స్ భారతీయ జంటలై ఉండాలి. విదేశీ జంటలకు సరోగసీకి అనుమతి లేదు. ఏఆర్‌టీ చట్టం ప్రకారం, స్పెర్మ్ సేకరణ కోసం ఏఆర్‌టీ బ్యాంకులు నేషనల్ రిజిస్ట్రీ ఆఫ్ బ్యాంక్స్ అండ్ క్లినిక్స్‌లో రిజిస్టర్ అయి ఉండాలి. స్పెర్మ్ డోనర్లు 21-55 ఏండ్ల వయస్సు కలిగి ఉండాలి. హెచ్‌ఐవీ, హెపటైటిస్ బీ, సీ వంటి వ్యాధుల కోసం పరీక్షించబడాలి. జన్యు వ్యాధుల కోసం ఫ్యామిలీ హిస్టరీ కూడా తనిఖీ చేయబడాలి. ఒక డోనర్ స్పెర్మ్ 75 సార్లు మాత్రమే ఉపయోగించబడుతుంది. స్పెర్మ్ నిల్వ కోసం క్రయో-ట్యాంకులు -196సీ వద్ద నిర్వహించబడాలి. ఒకవేళ ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే కనీసం పదేండ్ల జైలు శిక్ష, రూ.10 లక్షల జరిమానా విధించబడవచ్చు. అయితే చట్టాలు కఠినంగా ఉన్నా.. సరైన పర్యవేక్షణ లేకపోవడంతో సరోగసీ సెంటర్స్ రెచ్చిపోతున్నాయి.

చోరీకి సహకరించిన మహిళ అరెస్ట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
ఈనెల 21న సూర్యాపేటలో జరిగిన బంగారం చోరీ ఘటనలో ఒకరిని అరెస్ట్ చేశామని జిల్లా ఎస్‌పి నరసింహ తెలిపారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందని చెప్పారు. సూర్యాపేటలో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో కేసు వివరాలను ఆయన వెల్లడించారు. "జ్యువెలరీ షాపులో ఐదుగురు నిందితులు 2.05కిలోల బంగారం చోరీ చేసినట్లు గుర్తించాం. వారిలో ముగ్గురు నేపాల్ దేశస్థులు. ఇద్దరు ఝార్ఖండ్‌కు చెందిన వారు. నిందితులు షాపునకు సమీపంలో ఇల్లు అద్దెకు తీసుకొని రెక్కీ నిర్వహించారు. ఈ కేసులో ఓ మహిళను అరెస్ట్ చేశాం. ఆమె నుంచి 14 తులాల బంగారం స్వాధీనం చేసుకున్నాం. నిందితులు చోరీ చేసేందుకు ఆ మహిళ సహకరించింది. చోరీ చేసిన బంగారం హైదరాబాద్‌లో విక్రయించేందుకు తీసుకెళ్తూ సూర్యాపేట బస్టాండ్‌లో ఆమె పట్టుబడింది. నిందితులను పట్టుకునేందుకు ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం" అని ఎస్‌పి తెలిపారు.

యాక్సిస్ బ్యాంక్ ఎవాల్వ్ సెమినార్ ఏర్పాటు

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో
యాక్సిస్ బ్యాంక్ వైజాగ్‌లో తన ఎవాల్వ్ సెమినార్ 10వ ఎడిషన్‌ను నిర్వహించినట్లు తెలిపింది. ఎంఎస్ఎంఇలను 10 ట్రిలియన్ డాలర్లకు చేర్చాలనే ఉద్దేశ్యంతో దీన్ని ఏర్పాటు చేసినట్లు ఆసంస్థ పేర్కొంది. దీనికి యాక్సిస్ బ్యాంక్ వాణిజ్య బ్యాంకింగ్ గ్రూపు అధ్యక్షుడు విజయ్ శెట్టి, ఆ బ్యాంక్ ఉన్నతాధికారులు ప్రశాంత్ టిఎస్, బ్రెజేష చాహిల్, ఆశిష్ షా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో 110కి పైగా పరిశ్రమ నిపుణులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ జాతీయ జిడిపికి 4.9 శాతం, ఎగుమతుల్లో ఐదు శాతం వాటా మద్దతును అందిస్తుందని విజయ్ శెట్టి పేర్కొన్నారు. గత 10 ఏళ్లలో ఎవాల్వ్‌లో 50 పైగా నగరాల్లో 10,000 మంది పారిశ్రామికవేత్తలను భాగస్వాములను చేశామన్నారు.

విమానాశ్రయానికి రాణి రుద్రమదేవి పేరు పెట్టాలి

- రైతు డిక్లరేషన్ పూర్తిగా నీరుగార్చిన కాంగ్రెస్ ప్రభుత్వం
- ఆగస్టు 6న వరంగల్‌లో తెలంగాణ జాగృతి వార్షికోత్సవం : ఎమ్మెల్సీ కవిత

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో
వరంగల్‌లో ఏర్పాటు చేసే విమానాశ్రయానికి రాణి రుద్రమదేవి పేరు పెట్టాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండ జిల్లా ఎన్జీవోస్ కాలనీలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు దాదాపు 789మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని, రాష్ట్రం ఏర్పడ్డాక రాష్ట్ర ప్రభుత్వం 400 మంది రైతులకు రూ.5 లక్షలు ఇచ్చారని, మిగతా వారికి చట్టపరమైన ఇబ్బందుల వల్ల ఇవ్వలేకపోయారని అన్నారు. మిగతా 389 మందికి తెలంగాణ జాగృతి ద్వారా నెలకు రూ.2500 చొప్పున నాలుగు సంవత్సరాలు ఇచ్చి ఆదుకున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు డిక్లరేషన్ పేరిట ఇచ్చిన హామీలను పూర్తిగా నీరుగార్చిందని అన్నారు. రైతు రుణమాఫీ 50శాతం మాత్రమే చేసిందని, రైతు భరోసాను నామమాత్రంగా వేస్తున్నారని ఆరోపించారు. కవులు రైతును పూర్తిగా మరిచారని అన్నారు. పంటలకు మద్దతు ధర ఎక్కడ అని నిలదీశారు. పంట బీమా, మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి లింక్ చేస్తామని అంటున్నారని, ఇది సరైంది కదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా రైతులను మభ్యపెడుతూనే వస్తుందని అన్నారు. ఆగస్టు 6న జయశంకర్ జయంతిని పురస్కరించుకొని వరంగల్‌లో తెలంగాణ జాగృతి వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షులు దాస్య వినయ భాస్కర్, మహిళా అధ్యక్షులు మాధవి, జాగృతి రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

గురుకులాల్లో విద్యార్థుల మరణాలపై ఎన్‌హెచ్‌ఆర్‌సి విచారణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
రాష్ట్రంలోని గురుకులాల్లో విద్యార్థుల మరణాలపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సి) సోమవారం విచారించనున్నది. ఈ మేరకు ఆదివారం ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని పలు గురుకులాలు, పాఠశాలల్లో ఆహారం విషపూరితం కావడం (ఫుడ్ పాయిజన్), ఆత్మహత్యలు, అనుమానస్పద పరిణామాలతో విద్యార్థులు ప్రాణాలను కోల్పోవడంపై ఆప్ మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి నయీమ్ పాషా కమిషన్‌కు 2024 డిసెంబర్‌లో ఫిర్యాదు చేశారు. దీనిని కమిషన్ విచారణకు స్వీకరించింది. ఈ విషయంపై జులై 28న హైదరాబాద్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల రిసోర్స్ ఇన్ స్టిట్యూట్‌లో ఓపెన్ కోర్టు హియరింగ్ నిర్వహించనున్నది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని ప్రజా సంఘాలు, మానవ హక్కుల సంఘాలు, విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు పాల్గొని విద్యా వ్యవస్థపై వెలుగులోకి రాని నిజాలను కమిషన్ ముందుంచాలని సుధాకర్ సూచించారు.

సిఎంపై విమర్శలు తగవు

- కెటిఆర్‌కు అద్దంకి దయాకర్ హెచ్చరిక

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో: ముఖ్యమంత్రిపై విమర్శలు తగవని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మాజీ మంత్రి కెటిఆర్‌ను హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని టార్గెట్ చేయడం ఆయనకు వృధా ప్రయాసే అని తెలిపారు. సిఎం స్థాయిని తగ్గించే ప్రయత్నం చేస్తే రేవంత్ అంతకంతకు పైకి ఎదుగుతారని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేటీఆర్, హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డిలు సీఎం లక్ష్యంగా చేస్తున్న ఆరోపణలతో బిఆర్ఎస్ పార్టీకే నష్టమని తెలిపారు. రేవంత్‌ను ప్రతిపక్ష నేత కేసీఆర్ ఏమీ చేయలేక ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారని ఎద్దేవా చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న చుక్క రాములు

పోరాటాల ద్వారానే ప్రజాసమస్యల పరిష్కారం

- మోడీ పాలనలో అప్రజాస్వామిక విధానాలు రాజ్యమేలుతున్నాయి : చుక్క రాములు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం పోరాటాలే మార్గమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు అన్నారు. ఆదివారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని కేవల్ కిషన్ భవన్‌లో నిర్వహించిన సిపిఎం సమావేశంలో చుక్కరాములు మాట్లాడారు. ప్రపంచమంతా శాస్త్రీయంగా అభివృద్ధి చెందుతుంటే, మన దేశంలో మాత్రం మూఢాచారాలకు పెద్దపీట వేస్తూ బిజెపి పాలన చేస్తోందన్నారు. సమాజంలో సామాజిక అసమానతలు, మహిళలపై దాడులు రోజురోజుకు పెరుగుతున్నాయని తెలిపారు. సోషలిస్టు దేశాల్లో మార్క్సిజం ఆధారంగా ఆకలి, దారిద్ర్యం, దోపిడీ, అణిచివేత లేకుండా వారికి విద్య, ఉద్యోగ, ఉపాధి, తదితర రంగాల్లో మంచి పరిపాలన అందుతుందన్నారు. దేశంలో బిజెపి అధికారంలోకి వచ్చాక కులాలు, మతాల పేరిట విద్వేషాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్య, వైద్యం సామాన్య ప్రజలకు అందని ద్రాక్షలా మిగిలిపోతున్నాయని అన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను నాలుగు కోడ్స్‌గా కుదించి కార్పొరేట్లకు, యాజమాన్యాలకు వత్తాసు పలికే విధంగా పరిపాలన సాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో ఊగిసలాడుతుందన్నారు. ఈ ప్రభుత్వంలోనూ అభివృద్ధి పేర పేదల భూములు బలవంతంగా గుంజుకుంటున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మల్లేశం, మాణిక్, సాయిలు, రాంచందర్, నర్సింలు, జిల్లా కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

ఆదర్శ వివాహాలను ప్రభుత్వం, పౌర సమాజం ప్రోత్సహించాలి

- ఎస్‌వికె కార్యదర్శి ఎస్ వినయ కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
ఆదర్శ వివాహాలను ప్రభుత్వం, పౌరసమాజం ప్రోత్సహించాలని సుందరయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ఎస్ వినయకుమార్ కోరారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్), సుందరయ్య విజ్ఞాన కేంద్రం (ఎస్‌వికె) ఆధ్వర్యంలో టిపిఎస్‌కె రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఎల్లికంటి కీర్తి, అక్కి ప్రశాంత్‌ల ఆదర్శ వివాహం జరిగింది. ఈ సందర్భంగా వినయకుమార్ మాట్లాడుతూ కుల మతాంతర వివాహాలు చట్టవిరుద్ధం కాదని చెప్పారు. స్వకుల వివాహాలు సమాజాభివృద్ధికి ఆటంకంగా నిలుస్తాయని, మత, కులపరమైన ఆచారాల పేరుతో ఆధునిక మానవులను మధ్యయుగాల కాలంలోకి నడిపిస్తున్నారని చెప్పారు. శాస్త్ర, సాంకేతిక రంగం వేగంగా అభివృద్ధి అవుతున్నప్పటికీ మత, కుల పరమైన విద్వేషాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో నూతన దంపతులు సమాజాన్ని అర్థం చేసుకుని పురోగమన ఆలోచనలతో ముందుకు సాగాలని సూచించారు. కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు ఈ ఆదర్శ వివాహాన్ని పూల దండాలు మార్పించి ప్రమాణ పత్రాలు చదివించారు. కార్యక్రమంలో తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆర్ శ్రీరామ్ నాయక్ టిపిటిఎల్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఐత విజయ్ కుమార్ ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర నాయకులు డి కిరణ్, అశోక్ రెడ్డి, కెవిపిఎస్ నాయకులు పాల్గొన్నారు.

కౌశిక్‌రెడ్డి నోరు జాగ్రత్త

- ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ హెచ్చరిక

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో
నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలంటూ ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టుసాయికుమార్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని హెచ్చరించారు. ఇదే చివరి హెచ్చరిక అని చెప్పారు. ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి గురించి మాట్లాడే స్థాయి ఉందా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీలో ఎన్నో చెంచాలు ఉన్నాయనీ, అందులో కౌశిక్‌రెడ్డి ఓ చెంచా అని కొట్టిపారేశారు.

రిలే దీక్షలో మాట్లాడుతున్న తీగల సాగర్

భూ నిర్వాసితులకు 2013 చట్టం ప్రకారం పరిహారమివ్వాలి

- రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో
మక్తల్, నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పథకం భూ నిర్వాసితులకు ఇచ్చే పరిహారం న్యాయంగా లేదని, 2013 చట్టం ప్రకారం భూ నిర్వాసితులకు పరిహారం ఇవ్వాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్ అన్నారు. నారాయణపేట జిల్లా కేంద్రంలో 13 రోజులుగా భూ నిర్వాసితులు చేస్తున్న రిలే దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించి వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ.. ఎకరాకు రూ.14 లక్షలు ఆమోదయోగ్యం కాదని, రైతుల ఆందోళనలను ప్రభుత్వం పట్టించుకోకుండా బలవంత భూ సేకరణ చేయడం సరైనది కాదన్నారు. ప్రభుత్వం దయతో కాదు.. రైతుకు రావాల్సింది చట్టం ప్రకారం చెల్లించాలని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమ జిల్లా వాసే అయినప్పటికీ రైతులకు మేలు జరగకపోతే ఉద్యమమే శరణ్యమని స్పష్టంచేశారు. రూ.4500 కోట్ల నిర్మాణవ్యయంతో పనులను ప్రారంభించిన నారాయణపేట, కొడంగల్ ప్రాజెక్టు ఖర్చును రూ.పది వేల కోట్లకు పెంచేందుకు ప్రభుత్వం సిద్ధపడే అవకాశం ఉందన్నారు.

కానీ రైతుకు ఎకరాకు రూ.30 లక్షలు ఇచ్చేందుకు ముందుకు రావడం లేదని, రైతులకు ఆశించేంత ఇచ్చినా రూ.600 కోట్లు మాత్రమే ఖర్చు అవుతుందన్నారు. కానీ భూ నిర్వాసితులను ప్రలోభాలకు గురిచేయడం, ఆర్‌డీఓ స్థాయి అధికారి చేత బెదిరించడం మంచిది సరైంది కాదన్నారు. ప్రాజెక్టు నీళ్లు వచ్చిన తర్వాత మూడు నుంచి నాలుగు రెట్లు భూమి ధర పెరిగే అవకాశం ఉందన్నారు. 18 ఏళ్లు పైబడిన భూ నిర్వాసితులందరికీ పరిహారం చెల్లించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో భూ నిర్వాసితుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు జి.వెంకట్రామరెడ్డి, అధ్యక్షులు మశ్చేంధర్, ఉపాధ్యక్షులు ధర్మ రాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్, సిఐటియు జిల్లా కార్యదర్శి బాల్‌రాం, నాయకులు జోషి, కానుకూర్తి గ్రామ మాజీ సర్పంచ్ భీమ్ రెడ్డి, దామరగిద్ద మండలం కానుకూర్తి, మల్రెడ్డిపల్లి గ్రామ భూ నిర్వాసితులు పాల్గొన్నారు.

కన్న కూతురుపై తండ్రి లైంగికదాడి

- పరారీలో నిందితుడు
- నారాయణపేట జిల్లాలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
కన్న కూతురుపై తండ్రి లైంగికదాడికి పాల్పడిన ఘటన నారాయణపేట జిల్లా మరికల్ మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ రాము తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన పదేళ్ల బాలిక.. ఇంట్లో హోం వర్క్ చేసుకుంటున్న సమయంలో తండ్రి ఇంటికి వచ్చాడు. తాగిన మైకంలో ఉన్న తండ్రి.. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఒంటరిగా ఉన్న కూతురిపై లైంగికదాడికి పాల్పడ్డాడు. బాలికకు తీవ్ర రక్తస్రావం కావడంతో భయంతో తండ్రి పారిపోయాడు. ఇంటికి వచ్చిన తల్లి.. రక్తపు మడుగులో ఉన్న కూతురిని చూసి వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లింది. అక్కడ పరీక్షలు నిర్వహించిన వైద్యులు.. బాలికపై లైంగికదాడి జరిగినట్టు నిర్ధారించారు. బాలిక తల్లి భర్తపై ఫిర్యాదు చేయడంతో పోలీసులు గ్రామానికి చేరుకొని వివరాలు సేకరించినట్టు ఎస్ఐ తెలిపారు.

నీళ్లు, నిధులు, నియామకాలు ఏమయ్యాయి?

కాంగ్రెస్ చేస్తున్న దోపిడీపై నిలదీస్తాం

- స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి : కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రం.. పదేళ్ల కెసిఆర్ పాలనలో సుభిక్షంగా ఉందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్రంలోని నీళ్లు, నిధులు, నియామకాలు ఏమయ్యాయని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. ఆదివారం జయశంకర్-భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు గండ్ర జ్యోతి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. నీళ్లు.. ఎపి సిఎం చంద్రబాబుకు, నిధులు.. ఢిల్లీలోని రాహుల్ గాంధీకి, నియామకాలు కూడా చంద్రబాబు అనుచరులకు వెళ్తున్నాయని తెలిపారు. వీటిపై

గొంతు విప్పి ప్రశ్నించాల్సింది కేసీఆర్ దళమేనని, కసితో కొడితే అవతలోడి దిమ్మతిరగాలని అన్నారు. ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ రాష్ట్ర ప్రజల సాగు, తాగునీరు సౌలభ్యం కోసం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో మూడేళ్లలో కేవలం రూ.80వేల కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తి చేసి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేశారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి సొంత జిల్లా మహబూబ్‌నగర్ గురుకులాల్లో 111మంది విద్యార్థులు కల్తీ ఆహారం తిని అస్వస్థతకు గురయ్యారని అన్నారు. తమ ఇంట్లో పిల్లలకు ఇలాంటి భోజనమే అందిస్తున్నారా అని ప్రశ్నించారు. తెలంగాణ రైజింగ్ అని చెప్పుకుంటున్న ప్రభుత్వం రైజింగ్ ఎందులో ఉందో చెప్పాలన్నారు. రాష్ట్రంలో ప్రతి గురుకులాన్ని సందర్శించి విద్యార్థుల సమస్యలపై సర్వే చేయాలని బిఆర్ఎస్ శ్రేణులకు సూచించారు. భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జిగా గండ్ర వెంకట రమణారెడ్డి కొనసాగుతారని తెలిపారు. ఎలాంటి భేజాలకు పోకుండా పాత, కొత్త అనే తేడా లేకుండా అందర్నీ కలుపుకొని పోవాలని రమణారెడ్డికి సూచించారు. కూర్చున్న చెట్టును నరుకోద్దని, మాతృ సంస్థను కాపాడుకోవాలని కోరారు. పదేండ్ల బిఆర్ఎస్ పాలన, నేటి కాంగ్రెస్ పాలనపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో నియోజకవర్గంలో బిఆర్ఎస్ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ చేస్తున్న దోపిడీపై నిలదీస్తాం : కెటిఆర్

హనుమకొండ జిల్లా పరకాలలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి స్థాపించిన పోచంపల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ తీసుకున్న పరకాల, నడికూడ మండలాలకు చెందిన 500మంది మహిళలకు కెటిఆర్ కుట్టుమిషన్లు అందజేశారు. ఈ సందర్భంగా పరకాలలోని లలిత కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు సమీపంలో నాలా నిర్మాణం కోసం రూ.160 కోట్ల దోపిడీకి మంత్రులు, ఎమ్మెల్యేలు తెరలేపారని అన్నారు.

ఈ వ్యవహారంపై మండలిలో, శాసనసభలో ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. మెగా టెక్స్‌టైల్ పార్క్ సమీపంలో కాలువ నిర్మించడానికి జనవరి నెలలో రూ.137 కోట్లతో టెండర్లు పిలిచి టెండరింగ్ పూర్తయ్యాయన్నారు. అయినప్పటికీ ఆ పనికి తట్టెడు మట్టి కూడా పోయకుండానే మార్చిలో అదే పనికి ఎస్టిమేషన్ సరిపోదంటూ మరో రూ.160 కోట్లు పెంచుతూ రీ టెండర్స్ పిలవడంలో మతలబేంటని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీల పేరుతో అనేక హామీలు ఇచ్చి ఏ ఒక్కటీ నెరవేర్చలేదని ఆరోపించారు. ఈ సమావేశాల్లో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, ఎమ్మెల్సీలు బండ ప్రకాష్, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, పెద్ది సుదర్శన్ రెడ్డి, నన్నపనేని నరేందర్, మాజీ వికలాంగుల చైర్మెన్ వాసుదేవ రెడ్డి, మాజీ జెడ్పీచైర్మన్ సాంబారి సాంబారావు, బిఆర్ఎస్ నాయకులు ఏనుగు రాకేష్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరాణి సిద్దు, ఆయా మండలాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.